



రాధాకృష్ణగారు రిటైరైన రోజు సాయంత్రం మా మెడికల్ షాపుకు వచ్చారు. మందులిచ్చాక అలవాటు ప్రకారం బిల్లు చేతికివ్వబోతూంటే, 'ఇంకెందుకు బిల్లు? ఆఫీసులో ఇచ్చి డబ్బుచ్చుకొనే భోగం అయిపోయిందిరా" అంటూ అదోలా నవ్వారు.

"అయ్య బాబోయ్, మరైతే ఇంత ఖర్చు.... ఎలాగ మరి?" చటుక్కున అనేశాను అనాలోచితంగా.

జవాబివ్వకుండా పెదవి విరిచి, నుదురు కొట్టుకుని ఆయన వెళ్లిపోతూంటే 'ఎందుకన్నానా' అని బాధపడ్డాను.



నే నన్నదాంట్లో అతిశయోక్తి ఏమీ లేదు. నెలకి మూడు వేల రూపాయలపైన మందులపై ఖర్చు పెట్టడమంటే మాటలా? ఓ ప్రభుత్వ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరుకి పెర్సనల్ సెక్రెటరీగా పెద్ద జీతం, భత్యం తీసుకుంటూ ఆఫీసువాళ్లు ఖర్చులన్నీ భరిస్తూంటే వెలగడం ఒక ఎత్తు. పెన్షన్ సౌకర్యం లేకుండా రిటైరయ్యాక ఇంతలేసి ఖర్చులు తనే భరించడం మరో ఎత్తు. రిటైరయినప్పుడు పెద్ద మొత్తం ముట్ట చెప్పినా, చూస్తూ చూస్తూ దాన్ని, తన వైద్యానికే ఎవరూ ఖర్చు పెట్టేయలేరు కదా!

ఆఫీసు వాళ్లు ఆయన్ని పువ్వుల్లో పెట్టుకుని చూసుకొన్నారు. ఏసీ చాంబర్, ఏసీ కారు, బంగళాలో ఏసీ బెడ్ రూమ్, ఆఫీసులోనూ ఇంటా కూడా మెత్తటి ఫర్నిచరు, విమానాల్లో ప్రయాణాలు, ప్రతీ రూముకీ ఫోన్లు, కాలు కదపక్కర్లేకుండా ఇంటర్ కమ్‌లు, ఇంట్లో ఫాక్స్- సకల సౌఖ్యాలు కలగజేశారు. దానికి తగ్గట్టు రాధాకృష్ణగారు కూడా 'నా బొందో' నని పని చేసేవారు. ఆయనకు తెలియకుండా ఆఫీసులో ఏ కాగితం కదిలేది కాదు, ఎమ్.డి మాత్రమే కాదు- ప్రతీ జనరల్ మేనేజరూ ఆయన్ని సంప్రదించకుండా ఏ పనీ చేసేవారు కారు. ఫారిన్ కొలాబరేటర్లతో ఒప్పందాలైనా, సమ్మె చేసే కార్మికులతో రాజీలైనా, రాజకీయ నాయకులతో మంతనాలైనా- రాధాకృష్ణగారు కలగజేసుకోకపోతే పని సాగదు. ఇరవై నాలుగ్గంటలూ ఆయనకు ఆఫీసు ధ్యాసే. అంత బాధ్యతగా పని చేసే వ్యక్తి కాబట్టే పాత ఎమ్.డి. వేరే కార్పొరేషన్‌కు మారిపోతూ ఈయన్నీ తనతో రమ్మన్నాడు. ఈయన వెళ్లలేదు- ఈ ఆఫీసువాళ్లిచ్చే మెడికల్ ఫెసిలిటీలు వాళ్లివ్వలేరని.

అవును మరి! రాధకృష్ణగారి మందుల ఖర్చంటే గుండె అదిరిపోతాయి. జీర్ణకోశం, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు- ఆయన శరీరంలో జబ్బులేని భాగం లేదు. పైగా అల్సర్, పైల్స్, బీపీ, షుగర్ కూడా. సిగరెట్లు ("అదొక్కటేనయ్యా నన్ను రిలాక్స్ చేసేది"), డ్రింక్స్ ("ఫారిన్ ఇన్వెస్టర్లతో బేరసారాలాడేటప్పుడు తర్వాణి తాగాలంటావుటోయ్!") మానరు.

అయిదేళ్ల క్రితం మా మెడికల్ షాపు వాళ్లింటి దగ్గర్లో తెరిచినప్పుడు ఆయన్తో పరిచయం ఏర్పడింది. మా వ్యాపారం దినదినానికీ వర్ధిల్లిందంటే అది ఆయన చలవే. అలాటి ఒక్క కస్టమరుంటేనే వ్యాపారస్తుడికి పండగ. పైగా ఆయన తనతోటి ఉన్నతోద్యోగుల్ని కూడా మాకు కస్టమర్లుగా చేశాడు. ఈయనంత కాకపోయినా వాళ్లకీ సగమో, ముప్పావో జబ్బులున్నాయి.

అందుకే రాధాకృష్ణగారంటే నాకెంతో అభిమానం. న న్నీ స్థాయికి తెచ్చినది ఆయనా, ఆయన మిత్రులు. ఆయన భవిష్యత్తుగురించి నేను చింతించడంలో ఆశ్చర్యం ఏముంది?

నాలుగు రోజుల తర్వాత ఆయన మా షాపు కొచ్చినప్పుడు నేను క్షమాపణలు చెప్పబోతుంటే ఆయన వారించారు. నీ గురించి నాకు తెలియదా? నా మనస్సులో ఉన్న భావాలే నువ్వు పైకి అన్నావు. ఇప్పటి దాకా పైసా వెనకేయలేదు. పెద్ద జీతం ఇస్తూ ఆఫీసువాళ్లు సుఖాలు బాగా మప్పారు. వాళ్ల ఖర్చుతో రైల్లో ఫస్టు క్లాసులో తిరగడం అలవాటయ్యాక, స్వంత పని మీద వెళ్లినప్పుడు సెకండు క్లాసులో వెళ్లగలుగుతామా? 'ఇంకోదాంట్లో ఖర్చు తగ్గించుకొందాంలే' అంటూ ఫస్టుక్లాసు ఎక్కేస్తాం. దేని ఖర్చు దానిదే. ఎందులోనూ తగ్గించడం జరగదు. నేనొక్కణ్ణే కాదు, నా బట్టి ఇంట్లో అందరికీ ఇదే అలవాటయింది. 'రిటైర్‌మెంటు బెనిఫిట్స్' పెద్దమొత్తమే ఇచ్చారనుకో - కానీ కూర్చుని తింటే కొండలరిగిపోతాయి. వేరే ఉద్యోగం చేద్దామంటే ఈ పొజిషన్లో రిటైరయ్యాక చిన్న ఉద్యోగానికి వెళ్లడం నామోషీ".

"గ్రాట్యుయిటీ డబ్బు ఏంచేస్తున్నారు" అనడిగాను షాపు కోసం ఏదైనా అప్పిస్తారేమోనన్న ఆశతో.

"దాని మీద నాకంటే తక్కినవాళ్లు ఎక్కువ ఆశలు పెట్టుకున్నారులా ఉంది. మా పెద్దాడు ఉన్న ఉద్యోగం మానేసి స్నేహితుడితో కలిసి వ్యాపారం పెడతానంటాడు, చిన్నాడు ఫారిన్ చదువులంటాడు. అల్లుడు ఇంపోర్టెడ్ కారు కొంటానంటూ కబురెట్టాడు. ఎవరికిచ్చినా తతిమ్మావాళ్లు అలుగుతారు. అదొక వర్రీ. సిగరెట్లు ఎక్కువైపోయాయి, ఇంట్లో కూచున్నాక. నా వరస చూసి మా ఆవిడకి బీపీ పెరిగింది. దాని మందులకే వచ్చానిప్పుడు".

"ఇల్లు మారిపోతున్నారటగా" అన్నాను మందులందిస్తూ.

"అవును మరి. కంపెనీ వాళ్ల బంగళా వాళ్ల కప్పగించేయాలిగా. వేరే చిన్న ఇంటికి మారాలి. ఆ ఇంటాయనతో మాట్లాడాలని మొన్న బయలుదేరాను. కారు తీసేసుకున్నారుగా. ఆటోలో వెళ్లడం దండగనుకుని బస్సు కోసం

నిలబడితే ఎంతకూ రాదు. విసుగు పుట్టింది. మా అబ్బాయి స్కూటరు పట్టుకెళదామంటే 'బీపీ కదా కళ్లు తిరిగి పడితే కష్టమ'ని మా ఆవిడ అంది. పోనీ నింపాదిగా సైకిలు మీద వెళ్లొస్తానంటే ఆవిడ ఛస్తే ఒప్పుకోలేదు. తల కొట్టేసినట్టు ఉంటుందిట. చివరికి మావాడిని వెళ్లి మాట్లాడి రమ్మన్నాను. ఓ వందరూపాయలు ఎక్కువకి కుదుర్చుకొచ్చాడు. వ్యవహార జ్ఞానం ఉంటేగా!''

"నాకు చెప్తే నా స్కూటర్ మీద తీసుకెళ్లేవాణ్ణి కదా!''

"అడిగితే కాదనవనుకో. కానీ ఎన్ని సార్లని అడుగుతాను! నా జీవితం ఇకపై ఎలా గడవాలో నేను నిర్ణయించుకోవాలి కదా'' అన్నారు వెళ్లిపోతూ.

ఇల్లు మారిన తర్వాత రాధాకృష్ణగార్ని కలవడం తగ్గిపోయింది. వచ్చినపుడు మాత్రం చాలాసేపు కూర్చుని కబుర్లు చెపుతున్నారు. ఎక్సర్‌సైజు కోసం నడిచొస్తున్నారు కాబట్టి అలసట తీర్చుకోవడానికి కూర్చుంటున్నారని అనుకొనేవాణ్ణి. కానీ ఆయన నిజంగానే సాధారణ విషయాలపై ఆసక్తి చూపించడం నేర్చుకుంటున్నారని నా కర్థమయ్యింది. వేషధారణలో కూడా మార్పొచ్చింది. ఇది వరకెప్పుడూ సూటూ, బూటూ లోనే ఉండేవారు. ఇప్పుడు బూటు ఉంచుకున్నా సూటు వదిలేసి, ఇన్‌షర్టు చేసుకుని తిరుగుతున్నారు. టై కూడా లేదు.

ఓ రోజు మా బంధువుల వివరాలు చెప్పేటప్పుడు రాంపల్లి ప్రస్తావన వచ్చింది. ఆయన చాలా ఉత్సాహం చూపించారు.

"చెప్పావు కాదేం? ఆ ఊళ్ళో మాకు పొలాలున్నాయోయ్. తాతల నాటివి. రైతులు అయివేజు సరిగ్గా ఇచ్చారో, లేదో నేనెప్పుడూ పట్టించుకోలేదు. కంపెనీదే అయినా కోట్లతో వ్యవహరించేవాడికి వందలేం ఆనతాయి చెప్పు! నేనా ఊరు వెళ్లి ఎప్పుడూ చూసింది లేదు. ఇప్పుడు అమ్మేద్దామనుకొని ఉత్తరం రాస్తే బదులు లేదు. పొలం ఉందో, లేదో కూడా తెలీని స్థితిలో ఉన్నాను. ఊళ్లో ఎవరూ తెలీదు కూడా. మంచి సమాచారం చెప్పావు. మీ బావ అడ్రసు, అతని పేర ఉత్తరం రాసియ్యి. నేను వెళ్లి అతని సాయంతో వ్యవహారాలు చక్కబెట్టుకొస్తాను.

పల్లెటూరి వ్యవహారాలు అంత త్వరగా చక్కబడవని రాధాకృష్ణగా రెరుగగరులా ఉంది. నెల్లాళ్లుపోయాక మొహం వేలాడేసుకు వచ్చారు.

చాలా పొరపాటు జరిగిపోయిందోయ్. ఆ భూములు ఇప్పుడు చాలా ధర పలుకుతున్నాయి. రైతులు ఏకు మేకై కూర్చున్నారు. అయివేజు ఇవ్వరు; అమ్మనివ్వరు. నేనూ కాగితాలూ, దస్తావేజులు సరిగ్గా పెట్టుకోలేదు. ఆఫీసు కాగితాలు చూసుకునే హడావుడిలో స్వంత విషయాలు వెనకబడిపోయాయి.

మా కుటుంబానికి తెలిసిన వాళ్లెవరో ఉన్నారంటే వెళ్ల కలిశాను. సాటి గ్రామస్తుల మీదే వాళ్లకి సింపతీ. వాళ్లకీ వాళ్లకి మొహమాటాలుంటాయి మరి. మనమా పైవాళ్లయిపోతిమి. మీరే సాగు చేసుకుంటానంటే భూమి స్వాధీనం చేసుకోవచ్చు. అయినా మీ బ్రాహ్మలకి వ్యవసాయం ఏమిటండీ అని ఎకసెక్కాలు. నిజం చెపుతున్నాను. పెళ్లిళ్ల వ్యవహారంలో తప్ప, నా జీవితంలో కులం గురించి ఎన్నడూ పట్టించుకోలేదు. నేను బ్రాహ్మణ్ణన్న ఎరికే నాకు లేదు. ఆచారం లేదు. సంప్రదాయం లేదు. అలాంటిది నా కులం పేరు పెట్టి నన్ను ఎద్దేవా చేస్తే చాలా రోషం వచ్చింది. అల్సర్ మంట పెరిగిపోయింది. అక్కడే డాక్టరుకి చూపించుకుని మందులు తీసుకోవాల్సి వచ్చింది.

ఏవయ్యా! నాకు తెలీకడుగుతాను. ఫలానా కులం వాళ్లు ఫలానా దానికి పనికి రారని శాస్త్రం ఏదైనా ఉందా; ముందులో అందరూ భూమిని నమ్ముకుని వ్యవసాయాలు చేయడమో, చేయించడమో జరిగింది కదా! ఇంగ్లీషు చదువులూ, ఉద్యోగాలూ వచ్చాక బ్రాహ్మలు పొలాలమ్ముకుని పట్నాల కొచ్చేశారు. అంత మాత్రం చేత ...? ఇలా మాట్లాడటమా? మిగిలిన కులాల వాళ్లు ఉద్యోగాలు చేయుగా లేంది బ్రాహ్మణులు వ్యవసాయం చేయలేరా? నేను ఛాలెంజీగా తీసుకున్నాను. ఆ ఊళ్లోనే కాపురం పెట్టి, భూముల్ని స్వాధీనం చేసుకుని, వ్యవసాయం చేసి చూపిస్తానని నిర్ణయించుకున్నాను. మా ఇంట్లో వాళ్లంతా తిట్టిపోశారు - 'అయిన వాడికి అమ్మిరాక ఎందుకొచ్చిన సంత ఇది?' అని. 'ఈ పాటి ఆరోగ్యం కూడా నిలబెట్టుకోరా?' అని మా ఆవిడ గోల. నాకు మాత్రం పట్టుదలగానే ఉంది. నువ్వేమంటావ్?'' అని అడిగారు.

"నేను చేప్పేదేముంది? పెద్దవారు... అన్నీ ఆలోచించే చేస్తారు మీరు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండని మాత్రం చెప్తాన్నేను. మా బావది ఫ్యాన్సీ షాపు. సరుకు కోసం ప్రతీ నెలా ఈ ఊరికి వస్తూనే ఉంటాడు. తనతో మీ మందులన్నీ పంపుతాను. క్రమం తప్పకుండా వేసుకుంటూండండి.''

"ఈ ఏర్పాటు బావుంది. ఆ పల్లెటూరి షాపుల్లో ఎక్స్‌పైర్ అయిపోయిన మందులమ్మేస్తారని భయం ఉండేది. అది తీరింది.'' అన్నారాయన సంతోషంగా.

రాంపల్లి గొడవలు ఓ పట్టాన తెమలలేదు. భూమి స్వాధీనం చేసుకోడానికి చాలా ఖర్చయింది. అదీ ఈయన కొంత కాలం స్వయంగా సాగు చేసుకునే షరతు మీద. ఓ రెండు నెలల్లో చేతులెత్తేసి మళ్లీ తమ కప్పగించేస్తాడని రైతుల ధీమా. వ్యవసాయానికి కొత్త కాబట్టి రాధాకృష్ణ గారికి ఏదీ అరువు మీద దొరకలేదు. గ్రాట్యుయిటీ డబ్బు పెట్టి సాగుచేస్తాననేసరికి ఇంట్లో అందరూ శత్రువులయిపోయారు. 'డబ్బుతో పాటు ఉన్న ఆరోగ్యం కూడా ఊడ్చి పెట్టుకు పోవాలనా?' అని భార్య పోట్లాడింది, కూడా రానని బెదిరించింది. ఈయన అసలే తిక్క మనిషి. పట్టుదల పెరిగి, వెళ్లి పొలం మధ్యలో గుడిసె వేసుకొని ఒంటరిగా కాపురం పెట్టేశాడు. ఓ లైటు లేదు,ఫాను లేదు, మినరల్ వాటర్ లేదు, సెప్టిక్ టాంకుల్లేవు, ఈగలు, దోమలు, పురుగూ పుట్రా ఏ ఫైలేరియానో, మలేరియానో వస్తుందేమోనని వాటికి కావలిసిన మందులూ, ఆయింటుమెంట్లూ, అయోడెక్స్ (పొలం గట్టుమీద జారిపడితే...?) పంపించాను, మామూలు మందుల్తో పాటు.

రాధాకృష్ణగారికి పల్లెటూరి మనుష్యులు కొరుకున పడలేదు. ఒక్కడూ టైముకి రాడు, 'చూద్దాంలే' అనే ధోరణే తప్ప అనుకొన్న ప్రకారం, అన్న ప్రకారం పనులు చకచక చేయాలన్న ధ్యాసే లేదు. పెద్ద పెద్ద మల్టీనేషనల్ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లను గడగడలాడించిన రాధాకృష్ణగారు నిస్సహాయంగా మిగిలిపోయారు. వాళ్లతో వేగేసరికి ఆయనకు జీవితం మీద విరక్తి పుట్టినట్లుంది. మందులు మానేశారు. 'మూడోసారి పంపించినప్పుడు, క్రితం సారివే పడి ఉన్నాయి. కావాల్సి వచ్చినప్పుడు చెప్తాలే' అంటూ తిరక్కొట్టేశారు. ఆయన దేహ పరిస్థితి తెలిసిన నాకు చాలా ఆందోళన కలిగింది. ఆయన్ను ఏ స్థితిలో చూడాల్సి వస్తుందోనని భయపడ్డాను.

ఇంకో నెల్లాళ్లకి మా షాపుకి వచ్చినప్పుడు చూస్తే పరిస్థితీ మరీ అంత చేటుగా లేదనిపించింది. కానీ మందులు మానేసినందుకు మందలించబోయాను చనువుగా.

ఆయన నవ్వేశారు. "బతుకు మీద ఆశ పోలేదోయ్. మందుల అవసరం పడటం లేదంతే! రెండు, మూడు మందులు తప్ప మిగతా వన్నీ మానేశాను. అవి కూడా డోసేజి బాగా తగ్గించేశాను. బాధ వస్తే భరించడం నేర్చుకుంటున్నాను. ఇదివరకైతే ఆఫీసు కెళ్లి పై అధికారులతో నవ్వు మొహం పెట్టి మాట్లాడాలి కాబట్టి 'పెయిన్ -కిల్లర్' వేసుకొని పరిగెట్టేవాణ్ని. వాటికేవో సైడ్ - ఎఫెక్టులూ, న్యూసెన్సూ, ఇప్పుడేముంది! నొప్పి వస్తే ముడిచి పెట్టుకు పడుకోవడమే. అపాయింట్‌మెంట్ 'కీప్ - అప్' చేయాలన్న బాధ వాళ్లకే లేదు. నాకూ లేదు. పనివాళ్లొస్తే పురమాయించి కొబ్బరి తోటలో మడత మంచం వేసుకొని, చుట్ట కాలుస్తూ కూచుంటాను' వాళ్లు సరిగ్గా పని చేశారో లేదో నన్న ఆందోళన



## వ్యాకరణం

టీచర్ : 'అతడు దొంగతనం చేస్తున్నాడు' ఇది వర్తమానం. ఒరే రాముా! దీనికి భూతకాలం చెప్పరా?!

రాము : 'అతడు దొంగతనం చేసెను!'

టీచర్ : ఒరే గోపీ! భవిష్యత్ కాలం చెప్పరా?

గోపి : అతడు జైలుకు వెళ్లిపోతాడు!

**- తరిగొప్పుల వి.ఎల్.ఎన్.మూర్తి**

(రాయపూర్)

లేదు- మనకి పని తెలియదుగా! అదే ఆఫీసులో అయితే అన్ని పనులూ నాకు తెలుసుకాబట్టి లోపాలన్నీ కొట్టొచ్చినట్టు కనబడేవి. వాటిని సరి చేయాలని ఆరాటపడేవాన్ని."

"చుట్టలు కూడా మొదలెట్టారా?"

"కూడా కాదు, సిగరెట్లు మానేశాను. గంటల తరబడి తాపీగా కాల్చాలంటే చుట్టే బెటరు. సిగరెట్టయితే గబగబా కాలిపోతుంది. సిటీ లైఫ్ లాగే! హు హు! మందు కొట్టడం కూడా మానేశాను. కంపెనీ లేదుగా!"

"పొలం పనులు ఎలా సాగుతున్నాయి?"

"విపరీతంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఏమవుతుందో తెలీదు. దీంట్లో ఫెయిలయ్యానంటే ఇంట్లో వాళ్లు నన్ను బతకనివ్వరు. వ్యవసాయం గురించి నలుగుర్నీ అడిగి తెలుసుకుంటున్నాను. ఈ వయస్సులో కొత్త విషయాలు నేర్చుకోవడం భలే సరదాగా ఉందోయ్! వాళ్లూ చాలా మర్యాదగా చూస్తున్నారు. 'పంతులు గార'ంటారు నన్ను. ఆ పిలుపు తమాషాగా ఉంటుందనుకో. కానీ 'రాధాకృష్ణ' అని పేరు పెట్టి పిలవడానికి వాళ్లకు సంకోచం. ఎవరి పద్ధతులు వాళ్లవి. ఓ పట్టాన మారతాయా?"

రాధాకృష్ణ గారు పల్లెటూరి వాతావరణానికి అలవాటు పడుతున్నారులా ఉంది. దుస్తుల్లో కూడా మార్పొచ్చింది. పంచె, లాల్చీ వేసుకొన్నారు. గడ్డం మాసి ఉంది. మాటలో యాస, సామెతలూ తొంగి చూస్తున్నాయి. బస్సు రావడం ఆలస్యమయినా ఓపిగ్గా కాచుకొని బస్సెక్కి వెళ్లారు.

స్వభావసిద్ధమైన వినయం కొద్దీ రాధాకృష్ణగారు తన గురించి తాను పెద్దగా చెప్పుకోలేకపోయినా, మా బావ ద్వారా కబుర్లు తెలుస్తూనే ఉన్నాయి. సినిమా హీరోల్లా సంస్కరణలు తల పెట్టక పోయినా ఊళ్లో వాళ్లందరూ ఆయన దగ్గరికి సలహా, సంప్రదింపులకు వస్తున్నారట. మనిషి కూడా చలాగ్గా, చురుగ్గా తిరుగుతున్నారట. జొన్న రొట్టెలు కూడా వేయించుకొంటున్నారట. కళ్ల కింద చారలు పోయేయట.

మనిషిలో కూడా శాంతం, నెమ్మదితనం వచ్చాయిట. షేరు మార్కెట్లు ఆటుపోట్లు, రాజకీయ నాయకుల పార్టీ మార్పిళ్లు, మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే సంఘర్షణలు ఇవేవీ ఆయన్ని బాధించడం లేదట. ఏదో ఆ ఊళ్లో ఉండే సమస్యలు ఎలా పరిష్కరించాలి అని మాత్రం చర్చిస్తారట.

అన్నీ బాగానే ఉన్నాయి కానీ ఆయన మందులు దాదాపుగా మానేయడం నాకు నష్టమే కలిగించిందని చెప్పాలి. ఎలా లేదన్నా ఏడాదికి ఏభైవేల రూపాయల అమ్మకం పోయినట్టే కదా! ఏం చేస్తాం? ఎలా జరిగితే అలా జరగనీ అని సరిపెట్టుకున్నాను.

నా వ్యాపారం చల్లగా సాగాలని భగవంతుడికి తోచింది కాబోలు, రాధాకృష్ణ గారి పంట చేతికొచ్చే సమయానికి తుఫాను వచ్చి అంతా సర్వనాశనమైపోయింది. ఏడాది కష్టమంతా ఏటి పాలయ్యింది. ఎవరికైనా ఈ నష్టాన్ని తట్టుకోవడం మాటలు కాదు. అందునా రాధాకృష్ణ గారి లాంటి గుండె జబ్బు మనిషికి మరీను. ఇంటికి తిరిగి వచ్చేశారని తెలిసింది. చూడడానికి వెళ్లాను. ఏమైనా అటాక్, అదీ వచ్చిందేమో, మందులూ అవీ మనమే సప్లై చేద్దామని.

చూసి ఆర్నెల్లుపైనే అయ్యిందేమో గుర్తు పట్టలేకపోయాను. స్వామీజీలాగా గడ్డం, మీసం పెంచేశారు. ఒక తెల్ల లుంగీ, కాటన్ బనీను వేసుకున్నారు. బనీను మీద అరటి కాయ కర్రులు కూడా ఉన్నాయి. కాళ్లకు చెప్పుల్లేవు. ఆందోళనగానే పలకరించాను.

"పాపం మాట దక్కింది కాదుటగా! పోన్లెండి. మన చేతిలో ఏముంది? మీరు గుండె గట్టిచేసుకోవాలి. జాగ్రత్తగా మందులూ అవీ తీసుకుని, ఒళ్లు బాగయ్యేట్టు చూసుకోవాలి. ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదూ! ఖర్చుకి చూసుకోకండి. నేను మందులూ అవీ పంపిస్తాను. లెక్కా, డొక్కా తర్వాత చూసుకుందాం. డాక్టరుగారు ఏమన్నారు? సీరియస్‌గా ఉందనలేదు కదా?"

గందరగోళంగా మాట్లాడినట్టున్నాను. ఆయన తెల్లబోయినట్టు చూసి, "నాకు ఎటాక్ వచ్చిందని ఎవరైనా చెప్పారా ఏమిటి?" అనడిగారు.

నేను నీళ్లు నమిలి, "అదే, అదే... ఎవరో అంటేను... పాపం వ్యవసాయంలో పెద్ద దెబ్బ తిన్నారటగా" అన్నాను.

"అది నిజమే. అన్ని విధాలా నష్టపోయాను అంతా ఊడ్చుకు పోయింది. ఏం చేస్తాం? మళ్లీ ఎలాగైనా కాలూ, చెయ్యి కూడదీసుకుని ఆరంభించాలి" అన్నారు నిర్లిప్తంగా. భూమితో ఎటాచ్‌మెంట్ కనబరుస్తూనే, కర్మఫలంపై డిటాచ్‌మెంట్ చూపించే భారతీయ రైతు కనబడ్డాడు ఆయనలో.

నేను పెదాలు తడుముకున్నాను. "ఉన్నదంతా పొలం మీద పెట్టారు కదా. మరి మీ వాళ్లు" అర్ధోక్తితో ఆపాను.

"అన్నిటికీ కాలమే ఓ దారి చూపిస్తుంది. మనం ఊరకే ఆరాటపడి ప్రయోజనం లేదనుకో. మా అల్లుడికి వాహన గండం ఉందని ఎవరో జ్యోతిష్కుడు చెప్పాడట. కారు గోల వదిలి పోయింది. మా చిన్నాడికి ఫారిన్ స్టడీస్‌కి స్కాలర్‌షిప్ వచ్చింది. పెద్దాడి ఫ్రెండు, పార్ట్‌నర్‌గా చేరతానన్నవాడికి గల్ఫ్‌లో ఉద్యోగం వచ్చి వాడు వెళ్లిపోయాడు. దాంతో వీడి ఉత్సాహం చప్పబడింది."

"మీ ఆరోగ్యం మాత్రం..."

"నిక్షేపంలా ఉన్నానోయ్. జలుబు చేయడం కూడా మానేసింది. శరీరం అన్నిటికీ 'ఇమ్యూన్' అయి పోయింది. మనస్సు కూడా కష్ట సుఖాలకి అతీతంగా 'ఇమ్యూన్' అయిపోయిందనుకొంటాను. ఇప్పుడు మా ఆవిడా నాతో వచ్చి రాంపల్లిలోనే మకాం పెడతానంటోంది. ఇదివరకైతే ఎగిరి గంతేసే వాణ్ని. ఇప్పుడు సరే నీ ఇష్టం అని ఊరుకున్నాను. తుఫాన్ వచ్చినప్పుడూ అంతే! కళ్లెదురుగుండా కష్టఫలం కొట్టుకు పోతున్నా బాధ కలుగలేదు. ఏదో మన విధి నిర్వర్తించాలన్నట్టు గొడ్డూ, గోదా, మనుషులూ, సరుకులూ సాధ్యమైనంత వరకూ రక్షించాను. దక్కినంత దక్కింది- పోవాల్సినంత పోయింది."

నాకేం చేయాలో పాలు పోలేదు. ఈ మనిషికి నా ఓదార్పూ అక్కర్లేదు, మందులూ అక్కర్లేదు. అయినా తుది ప్రయత్నం చేశాను.

"మందులు ఏమేం వాడుతున్నారు?"

"ఏదీ లేదు. అసలు వాటి ధ్యాసే ఉండదు. ఒక బ్రీఫ్ కేసు నిండా టాబ్లెట్స్, కాప్స్యూల్సూ పడి ఉన్నాయి. తిరిగిచ్చేస్తాను. వాటి కో ధర కట్టి డబ్బిచ్చేద్దూ, మంచి వాడివి" అన్నారు రాధాకృష్ణ గారు నిష్కల్మషంగా నవ్వుతూ.

నాలోని వ్యాపారస్తుడు సిగ్గుపడ్డాడు.

